క్లుప్తంగా

అడవికి నిప్పు పెడుతున్న ఆకతాయిలు



పత్తికొండ వద్ద బెంగళూరు-చెన్నై హైవే పక్కన వ్యాపించిన మంటలు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల పక్కన అడవులకు కొందరు ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో ఎక్కడో ఒకచోట అడవి కాలిబూడిదవుతోంది. నిత్యం అగ్నిమాపక యంత్రానికి పని తప్పడం లేదు. బుధవారం సైతం గంగవరం మండలంలోని పత్తికొండ ప్రాంతంలో నిప్పు అంటుకుని కొంతమేర అడవి కాలిపోయింది. మొన్న మొగిలి, నిన్న సాకేవూరు అడవులకు నిప్పంటుకుంది. దీనిపై నిఘా ఉంచామని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని స్థానిక ఎఫ్ఆర్వో శివన్న హెచ్చరించారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతురునత్తంలో బుధవారం వ్యాధి నిరోధక టీకాలపై హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, టీకాల వలన ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవడంతోపాటు వైద్యాధికారుల సలహాలు-సూచనలు పాటించాలని కోరారు. తల్లిపాల ప్రాముఖ్యత, శ్వాసకోశ వ్యాధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే ప్రభుత్వమే రావాలని ప్రార్థనలు



కల్లూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

పులిచెర్ల(కల్లూరు): దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు సేవ చేసే ప్రభుత్వమే అధికారంలోకి రావాలని కల్లూరు చర్చిలో బుధవారం ప్రార్థనలు చేసినట్లు కల్లూరు చర్చి పాస్టర్ ధనరాజ్ తెలిపారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అన్ని రంగాలు అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షిస్తూ ప్రార్థించినట్లు చెప్పారు. దేశం, రాష్ట్రం సరైన పంథాలో మరింతగా వేగంగా ముందుకుపోవాలంటే బలమైన నాయకత్వం ముఖ్యమన్నారు. ప్రార్థనల్లో పాస్టర్లు శాంసంగ్, ప్రతాప్, మోషే, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్, లెక్చరర్లు

పుంగనూరు: ప్రస్తుతం సైబర్ నేరాలు తీవ్రమయ్యాయని వాటిపై అవగాహన పెంచుకుని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ షాహిద్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన , సైబర్ మోసాలు, అటల్ పెన్షన్, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, పోస్టర్లు విడుదల చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపరిచితులు పంపే లింకులు ఓపెన్ చేస్తే మన ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తారని, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదన్నారు. ఒకవేళ సైబర్ నేరస్తుల బారిన పడి నష్టపోతే వెంటనే 1930 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, సిబ్బంది మహమ్మద్, నూరాలి, రబ్బాని పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం తేనెబండలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని డీఐఓ రవిరాజు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈరోజు

మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. వేసవి, గంగజాతర, రంజాన్ పండుగ సమీపిస్తుండడంతో పట్టణంలో మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి చేశాం



కంభంవారిపల్లెలో బస్‌షెల్టర్ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి, పార్టీ నాయకులు



మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- జోరుగా పలుచోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

సదుం: నియోజకవర్గంలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి చేశామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. మండలంలో ఊటుపల్లె, తాటిగుంటపాలెం, జోగివారిపల్లె, తిమ్మానాయనపల్లెలో రూ.3 కోట్ల చొప్పున నిర్మించిన 33/11 కేవీ నూతన సబ్ స్టేషన్లను, కంభంవారిపల్లె క్రాస్, చింతపర్తివారిపల్లె క్రాస్, అమ్మగారిపల్లెలో ఒక్కోచోట రూ.3 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్లను, తాటిగుంటపాలెంలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు, సదుంలో రూ.10 లక్షలతో నిర్మించిన దోబీ ఘాట్, రూ.25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, భట్టువారిపల్లెలో రూ.95 లక్షలతో నిర్మించిన షాదీ మహల్‌నుఆయన ప్రారంభించారు. అలాగే జోగివారిపల్లె, తిమ్మానాయనపల్లెలో రూ.20. 80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, తిమ్మానాయనపల్లెలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. తాటిగుంటపాలెంలో దివంగత పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అలాగే మైనారిటీలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచులు శ్రీనివాసులరెడ్డి, ఎల్లప్ప, ఉషారాణి, అనితాకుమారి, లోకనాథరెడ్డి, మనోహర్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, గిరిధర్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, రమణారెడ్డి, రమేష్‌రెడ్డి, శివారెడ్డి, సయ్యద్‌బాషా, ఖాజాపీర్, హరినాథరెడ్డి, వెంకటస్వామి, మల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

మండల కేంద్రానికి చెందిన వెంకటస్వామి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందాడు. అతనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.80 లక్షలు మంజూరు అయ్యాయి. బాధితునికి మంత్రి చెక్‌ను పంపిణీ చేశారు.

అభివృద్ధికి ప్రాధాన్యం



సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల(సదుం): అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పేటూరు, నెల్లిమందలో మొత్తం రూ. 6కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్లను, కందూరులో రూ. 50 లక్షలతో నిర్మించిన షాదీమహల్, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 81 చిన్న ఉప్పరపల్లె, నెల్లిమంద, కామిరెడ్డిగారిపల్లెలో నూతన సచివాలయాల భవనాలను, సోమలలో రూ. 37 లక్షలతో నిర్మించిన బస్టాండ్, రూ.7. 23 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డులను బుధవారం మంత్రి ప్రారంభించారు. అలాగే పొదలగుంటపల్లె, ఎగువపల్లె, కామిరెడ్డివారిపల్లె, నగిరిండ్లు, కూకటి గొల్లపల్లెలో ఆర్‌ఓ ప్లాంట్లను ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ యార్డు ప్రారంభంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని తప్పిందన్నారు. టమాట, మామిడి వ్యాపారం సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డు నిర్మాణానికి పలు సవాళ్లు ఎదురైనా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ చైర్మన్ అరుణ, వైస్ చైర్మన్ శివారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు, అమాస మోహన్, నాగేశ్వరరావు, నాయకులు గంగాధరం, నాగభూషణరెడ్డి, శీలం భాస్కర్, రాజారెడ్డి, ప్రభాకర, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మార్చి 16న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకి సరిపడా కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, అధికారులు, పోలీసులు అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి

పెద్దపంజాణి: రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని రాజుపల్లె రైతు భరోసా కేంద్రంలో యూరియా పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి సచివాలయం పరిధిలో ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతుల దరికి ఎన్నో సేవలు అందేలా చేసిందన్నారు.న నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ఇవ్వడంతోపాటు సిబ్బంది భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవసరమైన సూచనలు-సలహాలను ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెరికల్చర్ అసిస్టెంట్ బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు క్రిష్ణప్ప, రైతులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మైనారిటీల అభ్యున్నతి



మసీదు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

- మసీదు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమంతోపాటు మైనారిటీల అభ్యున్నతికి కూడా ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. మండలంలోని విజలాపురం పంచాయతీ సంతమిట్టలో బుధవారం ఆయన నూతన మసీదును ప్రారంభించి మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ముస్లింలకు జగనన్న తగిన ప్రాధాన్యత ఇచ్చి పదవులు కట్టబెట్టారన్నారు. అనంతరం మసీదు పెద్దలు భరత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామ గౌడు, మండల కో-ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, మాజీ సర్పంచ్ మురళి, మసీదు పెద్దలు హైదర్‌బాషా, షమీవుల్లా, రషీద్, నసీముల్లా, అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా కట్టుదిట్టం: డీఎస్పీ



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్పీ

పలమనేరు: ఎన్నికల నేపథ్యంలో నిఘా కట్టుదిట్టం చేసి సరిహద్దుల నుంచి మద్యం, డబ్బు మొదలైన వాటి అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, ఎస్‌హెచ్‌ఓలతో సమీక్షించారు. పలమనేరు ప్రాంతం అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో కీలకంగా వ్యవహరించాలన్నారు.పాత కేసుల్లో నిందితుల బైండోవర్, ట్రబుల్ షూటర్స్‌పై గట్టి చర్యలు తీసుకోవాన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ ఇత్యాది వాటిపై చర్చించారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం: జగనన్న ఆరోగ్య సురక్ష-2ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం స్థానిక 16, 17 వార్డులకు సంబంధించి సచివాలయం-2లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు.పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగయ్య, సీపీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

గంగవరం: మండలంలో టెట్ పరీక్షలు రెండు రోజులుగా ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఉదయం 160 మంది, మధ్యాహ్నం 160 మంది సెషన్ల వారీగా పరీక్షలు రాసేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. రెండవ రోజు బుధవారం ఉదయం పరీక్షలకు 19 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 18 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ-1 వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలకు చీఫ్‌గా లక్ష్మీకాంతరెడ్డి, (టిసిఎస్) హరినాథరెడ్డి, అబ్జర్వర్‌గా ఎంఈఓ వ్యవహరిస్తున్నారు.

విజ్ఞాన మేళా..ప్రయోగాలు భళా!



పుంగనూరు: బసవరాజ పాఠశాలలో..



చౌడేపల్లె: సైన్స్ మేళాను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్‌రెడ్డి



పులిచెర్ల: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పుంగనూరు: విద్యార్థుల్లో దాగిన మేధాశక్తిని వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ దోహదం చేస్తుందని ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫేర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు చేశారు. అలాగే వారికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ, మున్సిపాలిటీ, మండలంలోని ఉన్న 139 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్‌ఫేర్ నిర్వహించామన్నారు. అలాగే రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమిలో డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, జ్ఞానాంబిక పాఠశాలలో డైరెక్టర్ వాసు, భాష్యం పాఠశాలలో హెడ్ మాస్టర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సైన్స్ ఫేర్ నిర్వహించారు. టీచర్లు వసుంధర, ఉమామహేశ్వరి, సీఆర్‌పి నారాయణస్వామి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో సైన్స్‌మేళాను జిల్లా ఏఎల్ఎస్‌ఓ అజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన చిత్రలు, నమూనాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం ఎంఈఓ కేశవరెడ్డి, నాగరాజు రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, మురళి, దేవదానం, శివప్రసాద్, ఉమాశంకర్, ఆనంద్, సుబ్రమణ్యం, పూర్ణిమ, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో విద్యార్థులు సైన్స్‌ఫేర్‌లో వివిధ అంశాలపై ప్రదర్శించిన నమూనాలను ఎంఈఓ సిద్ధరామయ్య పరిశీలించారు. ఉత్తమమైనవి ఎంపిక చేసి బహుమతు ఇచ్చారు. హెచ్‌ఎం శ్రీవాణి, టీచర్లు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విజ్ఞానమేళా నిర్వహించారు. విద్యార్థులు చేసిన సైన్సు ప్రయోగాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ఎంఈవో శ్రీనివాసులు బహుమతులు అందజేశారు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, లోకనాధరెడ్డి, ప్రకాష్, సైన్సు టీచర్లు పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం విజ్ఞానమేళాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, పెంగరగుంట ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళాను ఎంఈఓ లీలారాణి సందర్శించారు. విద్యార్థుల్లోని మేథోశక్తిని వెలికితీసేందుకు సైన్స్ మేళాలు ఎంతగానో ఉపకరిస్తాయని ఆమె అన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పెంగరగుంట విద్యార్థుల పీఎస్ఎల్వీ రాకెట్, ఇతర పాఠశాలల్లో పిల్లల ప్రయోగాలైన హృదయం, జీర్ణవ్యవస్థ, వాతావరణం, నీటి ఆవిరితో నడిచే జేసీబీ, ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నల్ సిస్టం, హోమ్ థియేటర్, గాలితో, నీటితో పనిచేసే వాక్యూమ్ క్లీనర్ల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, మండలంలోని ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు, సైన్సు ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నేషనల్ సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం విజ్ఞానమేళా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను, చేసిన ప్రయోగాలను ఎంఈఓ సాయిలీల పరిశీలించారు.

వి.కోట: విజ్ఞాన మేళాతో విద్యార్థుల్లో మేథోశక్తి పెరుగుతుందని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఖాజీపేట, బాలుర ఉన్నత పాఠశాల, ఎరినాగేపల్లె పాఠశాలలో విజ్ఞానమేళాలు ఆకట్టుకున్నాయి. ఖాజీపేటలోని ఉర్దూ పాఠశాలలో ఎంఈఓ, వైస్ ఎంపీపీ తమీమ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, హెచ్‌ఎం ఇలీయాజ్ విద్యార్థుల చేసిన ప్రయోగాలను పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు.

శాంతిపురం: కూతేగానిపల్లె ఉన్న శ్రీ పరమహంస యోగానంద పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్‌డే వేడుకల్లో ప్రిన్సిపల్ ఆజాద్ హుసేన్ మాట్లాడారు. సర్ సీవీ రామన్ జీవితాన్ని, ఇంజినీరింగ్ రంగంలో ఆయన సేవలను విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా వివరించారు. వివిధ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సైన్స్ టీచర్లు సంపత్, నళిని, అక్షత, ప్రియాంక, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



పెంగరగుంట విద్యార్థులు రూపొందించిన పీఎస్ఎల్వీ రాకెట్ నమూనా



రొంపిచెర్లలో..సీవీ రామన్‌కు నివాళి



వి.కోట: ఎరినాగేపల్లె పాఠశాలలో..



పలమనేరులో..



గంగవరం: పొన్నమాకులపల్లెలో..



బైరెడ్డిపల్లె: జెడ్పీ హైస్కూల్లో ..



పరమహంస యోగానంద పాఠశాలలో..

టైలర్ల అన్నదానం



అన్నదానం చేస్తున్న టైలర్ల నాయకులు

పుంగనూరు: టైలర్స్‌డే పురస్కరించుకుని బుధవారం రొంపిచెర్లలో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా సర్కిల్‌లో అన్నదానం చేశారు. అసోసియేషన్ నాయకులు ఖాసీమ్, సురేంద్ర, నరసింహులు మాట్లాడారు. టైలర్లకు ప్రత్యేకంగా కమ్యూనిటీ భవనం, ఇళ్ల స్థలాలతో పాటు ఆర్థిక సహాయం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. టైలర్లు రవికుమార్, మంజుల, అమ్మజాన్, గురుమూర్తి, రమేష్‌బాబు, మహబూబ్‌బాషా, బాషా, అతావుల్లా, అస్లాంబాషా, శ్రీనివాసులు, రాజా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రామకుప్పం: రాయలసీమ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ముద్దనపల్లె, వీర్నమల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లను టైలర్లు పంపిణీ చేశారు. టైలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రఫీ మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాబురెడ్డి, సెక్రటరీ మహమ్మద్, కోశాధికారి నరేష్ , కుప్పుస్వామి, అక్బర్, గంట్లరెడ్డి పాల్గొన్నారు.

వి.కోట: పట్టణంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. స్థానిక సాయిగార్డెన్‌లోని ఆదర్శ పాఠశాలలోని ప్రత్యేక ప్రతిభావంతులకు బ్రెడ్లు పంపిణీతోపాటు అన్నదానం చేశారు. పలువురు టైలర్లు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్లు, చేతివృత్తుల వారి కష్టాలను గుర్తించి ఏడాదికి రూ.10,000 ఆర్థిక సాయం చేస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ఆదర్శ పాఠశాల నిర్వహకురాలు భార్గవి, మండలంలోని టైలర్లు పాల్గొన్నారు.



రామకుప్పంలో..



వి.కోటలో..